క్లుప్తంగా

భోజనం ప్లేట్ల పంపిణీ



విద్యార్థులు కంచాలు, గ్లాసులు పంపిణీ చేసిన దృశ్యం

భీమవరం అర్బన్: నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేయటమే కాక నాణ్యమైన విద్యను అందిస్తోందని దాత ఎ.జయలక్ష్మి అన్నారు. కొమరాడ గొర్లమూడి ఎంపీపీ పాఠశాలలో గురువారం దాత ఎ.జయలక్ష్మి విద్యార్థులకు స్టీల్ గ్లాసులు, భోజన ప్లేటులను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.కృష్ణమూర్తి, విద్యాకమిటీ సభ్యులు జి.కుమారి, టి.సుజాత, రమ్య, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వీవీఆర్ హనుమంతరావు పాల్గొన్నారు.

నాగేంద్రస్వామికి రజత కవచం సమర్పణ

వీరవాసరం: తోలేరులో వేంచేసియున్న శ్రీ వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలోని నాగేంద్రస్వామికి గురువారం రజత కవచాన్ని దాతలు అందజేశారు. దొడ్డనపూడి గ్రామానికి చెందిన కొల్లి సురేష్ బాబు దంపతులు స్వామివారికి సుమారు రూ.50 వేల విలువైన రజత కవచం అందించారని ఆలయ ట్రస్ట్ బోర్డ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ముందుగా దాతలు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. దాత కొల్లి సురేష్ బాబు దంపతులు, ఆలయ నిర్వాహకులు చవ్వాకుల సత్యనారాయణమూర్తి, చినబాబు భైరవభట్ల మురళీకృష్ణశర్మ పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సేవలో సుంకర దంపతులు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని గురువారం పద్మశ్రీ డాక్టర్ సుంకర ఆదినారాయణ దంపతులు దర్శించుకున్నారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదినారాయణ దంపతులకు ఆలయ అర్చకులు వేదా ఆశీర్వచనం అందించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

శ్రీమావుళ్లమ్మ అమ్మవారి సన్నిధిలో జరుగుతున్న శాశ్వత నిత్యాన్నదానానికి గురువారం భీమవరానికి చెందిన పీటీ శ్రీనివాస అయ్యర్ లక్ష నూటపదహారు రూపాయలు విరాళం అందించారు. ఈ సందర్భంగా దాతను ఆలయ అధికారులు, ధర్మకర్తలు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మావూరి సుందరరావు పాల్గొన్నారు.

ఘనంగా రుద్ర మహాయాగం



రాయకుదురులో శ్రీరుద్ర మహాయాగం నిర్వహిస్తున్న రుత్వికులు

వీరవాసరం: శ్రీ చండీయాగపూర్వక శ్రీ మహా మృత్యుంజయ పాశుపత శ్రీరుద్రమహాయాగ మహోత్సవం రాయకుదురులో గురువారం ప్రారంభించారు. శ్రీ ఉమా రామలింగేశ్వర వేద పాఠశాల ఆధ్వర్యంలో 67వ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. యాగం ప్రారంభం సందర్భంగా స్వామివార్ల గ్రామ ప్రదక్షిణ, గణపతి పూజ, పుణ్యాహవాచనం గోపూజ, రుత్విక్ వర్ణుల దీక్ష రక్షాబంధనం, సర్వతోభద్ర మండప నవగ్రహ, యోగిని వాస్తు క్షేత్రపాలక మండపారాధన, సూర్య నమస్కారాలు, అంకురార్పణ, ధ్వజారోహణం, దేవతా ఆవాహనం కార్యక్రమాలు నిర్వహించారు. అగ్నిమాత్రం మహా మృత్యుంజయ, పాశుపత, రుద్ర హోమం, శివ కల్యాణం జరిపారు. కార్యక్రమంలో యాగ కర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ, సుదురుపాటి భానుమూర్తి, పోలిశెట్టి సత్యనారాయణ, పోలిశెట్టి చంటి, దాసరి ఏసుబాబు, కటకం సుబ్రహ్మణ్యం ఎ.జవహర్ లాల్ నెహ్రూ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఓ యువకుడి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన గంగుల వరలక్ష్మి కుమారుడు గంగుల సురేష్ కుమార్ పదో తరగతి వరకు చదివి కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 21 నుంచి సురేష్ కుమార్ కనిపించడం లేదని తల్లి గంగుల వరలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్పీ విచారణ

వీరవాసరం: రాయకుదురు సర్పంచ్ గడ్డం భారతి, ఆమె భర్త భాస్కరరావులను కులం పేరుతో దూషించారన్న కేసుపై భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్ గురువారం గ్రామంలో విచారణ చేపట్టారు. సంఘటన ప్రాంతాన్ని సందర్శించి ఇరువర్గాల నుంచి సాక్ష్యాలను సేకరించారు. సంఘటనపై ఆరా తీశారు. ఆయన వెంట భీమవరం రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్, ఏఎస్ఐ కెల్లా ధర్మారావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

త్వరలో జగనన్న కాలనీల్లో అంతర్గత రోడ్లు

- భీమవరం ఆర్డీఓ దాసి రాజు
- తాళ్లకోడు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ ప్రగతి పరిశీలన

ఆకివీడు: జగనన్న కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించినట్లు భీమవరం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ ప్రగతిని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం టెక్నికల్ అసిస్టెంట్‌లతో, గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించారు. రూ.2.25 లక్షల వ్యయంతో నిర్మించే ఇళ్ల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 65 ఇళ్ల నిర్మాణానికి పనులు జరుగుతున్నట్లు హౌసింగ్ డీఈ శివరామరాజు చెప్పారు. లబ్ధిదారులు 484 మంది ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారన్నారు. తాళ్లకోడు జగనన్న లేఅవుట్‌లోని అంతర్గత రోడ్లు వర్షానికి పాడైపోయాయని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ అధికారులు ఆయా రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మించేందుకు అంచనాలు రూపొందించనున్నారని డీఈ చెప్పారు. హౌసింగ్ ఏఈ భాస్కరరాజు, తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి

వీరవాసరం: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులంతా తక్షణమే ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఆర్డీఓ దాసిరాజు అన్నారు. మండలంలోని మడుగు పోలవరం, రాయకుదురు గ్రామాల్లోని జగనన్న కాలనీలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన విలువైన స్థలాన్ని సద్వినియోగపరుచుకోవాలని, లబ్ధిదారులు తక్షణం ఇంటి నిర్మాణాలను, బేస్మెంట్లను ప్రారంభించుకోవాలని సూచించారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. రాయకుదురు జగనన్న లేఅవుట్‌ను ఆనుకుని ఉన్న రొయ్యల చెరువు గట్టును తక్షణం తొలగించి ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా గట్లను వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ డీఈ వెంకటరమణ, గ్రామ సర్పంచ్ గడ్డం భారతి, గడ్డం భాస్కరరావు, బోనం నాగ పరమేశ్వరరావు, విజయ్ కుమార్, గడ్డం భాస్కరరావు, ఎం.వెంకట్రావు, గ్రామ సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు





తాళ్లకోడు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణంపై సమీక్షిస్తున్న ఆర్డీఓ దాసి రాజు, అంతరచిత్రంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత

సాక్షి, భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యతోపాటు, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తోందని ఎండీఎం జిల్లా కో–ఆర్డినేటర్ కృష్ణారావు అన్నారు. పట్టణంలోని పీఎస్ఎం గర్ల్స్ హైస్కూల్‌లో గురువారం రాగిజావ పంపిణీని పరిశీలించారు. తయారీ అనంతరం రుచి చూసి, విద్యార్థినులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తోందన్నారు. పోషక విలువలతో కూడిన మెనూను అమలు చేస్తున్నామన్నారు. ఏడాదికి రూ.86 కోట్ల నిధులతో రాగిజావను వారానికి మూడుసార్లు పంపిణీ చేస్తారని, మిగిలిన రోజుల్లో చిక్కీలు పంపిణీ చేస్తారన్నారు. విద్యార్థుల పెరుగుదలకు ఐరన్, కాల్షియం, ప్రొటీన్‌లు అందుతాయన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్ఎం సుధా రాణి, ఉపాధ్యాయుడు జ్ఞానమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేస్తున్న కృష్ణారావు

పోలవరంపై కేంద్రానిది సవతి తల్లిప్రేమ

సాక్షి, భీమవరం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి బాధ్యత తమదేనంటూ చెబుతూ కేంద్ర ప్రభుత్వం అరకొర నిధులు కేటాయిస్తూ సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని అఖిల భారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు లంక కృష్ణమూర్తి విమర్శించారు. భీమవరంలో గురువారం ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణం ఖర్చంతా కేంద్రమే భరిస్తుందని విభజన చట్టంలో పేర్కొన్నా నిధులు కేటాయింపు సక్రమంగా లేకపోవడంతో ప్రాజెక్టు నిర్మాణం మరో పదేళ్లకు కూడా పూర్తయ్యే పరిస్థితులు కన్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా చర్యలు తీసుకోవాలని నిధులు పూర్తిస్థాయిలో కేటాయించి త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అకాల వర్షాలు, వడగళ్ల వాన కారణంగా పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో టి.రామచంద్రరావు, రాజు నాయుడు, ప్రసాదరాజు, ఎ.సూర్యనారాయణ, పి.మహేశ్వరరావు, దండు శ్రీనివాసరాజు, కనుమూరి వెంకటపతిరాజు పాల్గొన్నారు.



భీమవరంలో అఖిల భారత అగ్రగామి కిసాన్ సభలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

వైద్య సేవలు మెరుగుపడాలి

కాళ్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు మెరుగుపడాలని కాళ్ల ఎంపీపీ పెన్మెత్స శిరీష అన్నారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమీక్ష సమావేశం ఎంపీపీ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ విస్తృత సేవలందించాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అదేవిధంగా ప్రభుత్వఆసుపత్రిలో ప్రసూతి సేవలు మెరుగుపరచాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, కాళ్ల సర్పంచ్ బందా విజయ, జక్కరం ఉపసర్పంచ్ కూచంపూడి లక్ష్మీపతిరాజు, డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్, పెన్మెత్స విశ్వనాథరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



కాళ్ల పీహెచ్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష

కొణితివాడలో ముగిసిన కబడ్డీ పోటీలు

వీరవాసరం: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, ఉత్తేజం కలుగుతుందని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గానాగమల్లేశ్వరరావు (బాబు) అన్నారు. ఉగాది సందర్భంగా కొణితివాడలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఆటపాటల ద్వారా ఆరోగ్యవంతమైన పోటీతత్వం ప్రతి ఒక్కరికి అలవడుతుందన్నారు. కొణితివాడ గ్రామంలో మ్యాట్లపై కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో విజేతలను అభినందించారు. మొదటి బహుమతి రూ.20 వేలు రెడ్ బుల్లెట్స్ కొణితివాడ టీమ్‌కు, ద్వితీయ బహుమతి రూ.12,500 బేతపూడి శ్రీను జట్టుకు, తృతీయ బహుమతి రూ.7,500 కొణితివాడ జూనియర్స్ జట్టు పొందాయి. కార్యక్రమంలో బిళెట్టి కోటేశ్వరరావు, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, గొలగాని సత్యనారాయణ, యరకరాజు చినబాబు, యరకరాజు పెద్దబాబు, నాగరాజు వెంకట గోపాలకృష్ణరాజు, యరకరాజు హరిబాబు, నాగరాజు భాస్కర్‌రాజు, దుర్గాప్రసాద్, ప్రసన్న, నాగరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

కోతుల బెడదను అరికట్టండి సారూ..

ఆకివీడు: అంకోడు దళితపేట వాసులను కోతులు హడలెత్తిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కుప్పనపూడి శివారులో ఉన్న ఈ ప్రాంతానికి వందలాదిగా కోతులు వలస వచ్చాయి. దీంతో స్కూళ్లకు వెళ్లే పిల్లలు ఇంటి నుంచి బయటకు రావాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్లల్లోకి చొరబడి ఆహారాల పదార్థాలను తినేస్తున్నాయి. పిల్లల్ని కరిచే ప్రయత్నం చేయగా పెద్దలు అదిలించడంతో పారిపోతున్నాయి. వందలాదిగా ఆ ప్రాంతంలో సంచరిస్తున్న కోతులను తరిమేందుకు ఇటీవల స్థానికులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో పలువురు పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. దీనిపై కార్యదర్శి ఆనంద్ స్పందిస్తూ కోతుల్ని పట్టుకునేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించాల్సి ఉందన్నారు. అంత సొమ్ము పంచాయతీలో లేదని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో బంటుమిల్లి సురేష్, వెంకటేశ్వరరావు, గాతల జాన్‌ప్రసాద్, మద్దా జయబాబు, మదాసు సతీష్ కుమార్, శిరింగిల ఇస్మాయేలు తదితరులున్నారు.



పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇష్టానుసారంగా ఇళ్ల నిర్మాణాలు

స్పందనలో ఫిర్యాదు చేసినా కానరాని చర్యలు

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని గాంధీనగరంలో తాడిచెట్లు తోట ఎదురుగా ఉన్న ఓ లేఅవుట్‌లో నిబంధనలు అతిక్రమించి ఇళ్ల నిర్మాణం జరుగుతోందని గతంలో కొందరు కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. దానిపై భీమవరం టౌన్ ప్లానింగ్ అధికారుల ఆదేశాల మేరకు వార్డు సచివాలయ అధికారులు నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశారు. అయినా వీటిని బేఖాతరు చేస్తూ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, దీని వల్ల వీధులు ఇరుగ్గా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేస్తున్న వారికి అధికారులు కూడా సహకరిస్తున్నారనే స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.



గాంధీ నగరంలో లేఅవుట్ ఇదే

పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన

భీమవరం అర్బన్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.వరలక్ష్మి అన్నారు. దిరుసుమర్రు అంగన్‌వాడీ కేంద్రంలో విస్సాకోడేరు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గుడ్లు, బాలామృతం, బెల్లం, ఎండు ఖర్జూరం తదితర పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. గర్భిణులు ఐరన్, కాల్షియం లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



దిరుసుమర్రులో పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దళిత యువకుడి హత్యను నిరసిస్తూ ఆందోళన

సాక్షి, భీమవరం: కాకినాడ జిల్లా శృంగవృక్షం గ్రామంలో దళితవాడపై దాడి చేసి యువకుడిని హత్య చేసిన కుల దురహంకారులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. దళితులపై జరిగిన హత్యాకాండను ఖండిస్తూ భీమవరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కాంతిబాబు మాట్లాడుతూ అగ్రవర్ణాల దాడిలో దళిత యువకుడు నడిపల్లి రాము దారుణంగా హత్యకు గురయ్యాడని, నిందితులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు చిన్నం చిన నాగేశ్వరరావు, మాదాసు గోపి పాల్గొన్నారు. దళిత యువకుడ్ని హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ వై.రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్, పాలపర్తి జోనా, దొడ్డిగర్ల మునియ్య, గెడ్డం జార్జ్, ఖుంగా ప్రహ్లాదుడు పాల్గొన్నారు.

విప్లవ వీరుల త్యాగాలు చిరస్మరణీయం

భీమవరం (ప్రకాశం చౌక్): దేశ స్వాతంత్ర్య సముపార్జనలో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు తదితర విప్లవ వీరులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలోని క్విట్ ఇండియా (అమరవీరుల) స్తూపం వద్ద అధికారులు, రిటైర్డ్ ఉద్యోగులతో కలసి విప్లవకారులకు వి.రాధాకృష్ణ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాలాలజపతిరాయ్‌పై పోలీసుల లాఠీచార్జి, జలియన్‌వాలాబాగ్ మారణకాండ ఘటనలు విప్లవకారులను కలచి వేశాయిని, ఆ నేపథ్యంలో బ్రిటిష్ వారిపై ప్రతీకార చర్యలతో పాటు స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటం చేశారన్నారు. ఉప ఖజానా అధికారి అల్లూరి రవివర్మ మాట్లాడుతూ చిన్న వయసులో విప్లవ వీరులకు బ్రిటిష్ ప్రభుత్వం ఉరిశిక్ష విధించిందన్నారు. విప్లవ వీరులకు రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గాతల జేమ్స్, కార్యదర్శి ఎస్ఎస్ఎన్ రాజు, పి.సూర్యనారాయణ, పి.విజయవర్మ నివాళులర్పించారు.

భగత్‌సింగ్ ఆశయాల సాధనకు కృషి

సాక్షి, భీమవరం: ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భగతసింగ్ వర్ధంతిని ఏఆర్‌కేఆర్ మున్సిపల్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయాల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు పి.మోహిని, పట్టణ సహాయ కార్యదర్శి యూ వినోద్ పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: భగత్‌సింగ్ ఆశయాల సాధన కోసం యువత పని చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ అన్నారు. గురువారం పార్టీ కాళ్ల గ్రామ శాఖ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, మండా సూరిబాబు, తిరుమాని శ్రీను పాల్గొన్నారు.

నవుదూరు సెంటర్‌లో..

వీరవాసరం: ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ భారతమాత స్వేచ్ఛ స్వాతంత్ర్యం కోసం గర్జించి తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన గొప్ప దేశభక్తులని సీపీఎం నాయకులు బళ్ల చిన వీరభద్రరావు కొనియాడారు. నవుదూరు సెంటర్లో పార్టీ ఆధ్వర్యంలో సర్దార్ భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన వీరభద్రరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో విప్లవ వీరులు తెల్లవాడి గుండెలను చీల్చి బ్రిటిష్ పాలకుల పునాదులను కదిలించారన్నారు. జుత్తిగ నరసింహమూర్తి, కేత జ్యోతి బాసు, కిలాడి సత్యనారాయణ, మైగాపుల త్రిమూర్తులు, లింగం సత్యనారాయణ పాల్గొన్నారు.

దేశభక్తి అలవర్చుకోవాలి

ఆకివీడు: యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జేఎన్వీ గోపాలన్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి గురువారం పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన వారిని స్ఫూర్తిగా తీసుకుని యువత దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. సమ సమాజ స్థాపనకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. చెడు వ్యసనాలు, విదేశీ సంస్కృతులను విడనాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.తవిటినాయుడు, బీ.వీ.వర్మ, సూరిబాబు, జీ.ధనుష్, డీ.రవితేజ పాల్గొన్నారు.



భీమవరంలో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నేడు ఎమ్మెల్యే శంకుస్థాపన

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని కొత్త పూసలమర్రు గ్రామంలో పంచాయతీ కార్యాలయానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం ఉదయం 9 గంటలకు శంకుస్థాపన చేస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిరుమాని ఏడుకొండలు గురువారం తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: మండలంలోని దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్సు బోధించేందుకు అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ కంప్యూటర్‌తో పాటు నెట్, స్లెట్, ఎంటెక్ అర్హత ఉన్న అభ్యర్థులు ధ్రువపత్రాలతో కళాశాలలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

25 నుంచి గాలికుంటు నివారణ టీకాలు

పాలకోడేరు: మండలంలో ఈనెల 25వ తేదీ నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని మండల పశు వైద్యాధికారి మౌర్య సత్యేంద్ర గురువారం చెప్పారు. వచ్చే నెల 24వ తేదీ వరకు నెలరోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పాడి రైతులు తమ పశువులకు టీకాలు వేయించి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు చెరువుకు నీరు

ఆకివీడు: గుమ్ములూరు పంచాయతీ పరిధిలో మంచినీటి చెరువులో పూడిక తొలగింపు పనులు పూర్తయిన సందర్భంగా చెరువులోకి నీటిని నింపే కార్యక్రమాన్ని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు శుక్రవారం ప్రారంభిస్తారని సర్పంచ్ కోట అనంత లక్ష్మీ గురువారం విలేకరులకు చెప్పారు. గత కొన్నేళ్లుగా మంచినీటి చెరువులో పూడికలు పేరుకుపోవడంతో మంచినీరు అంతంత మాత్రంగానే నింపాల్సి వచ్చేదన్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత గ్రామంలో చినకాపవరం డ్రెయిన్‌వద్ద రేవు అభివృద్ధి, రక్షిత మంచినీటి పథకాలకు మరమ్మతులు, ప్రాథమిక పాఠశాల వద్ద డ్రెయిన్ నిర్మాణం, దళితవాడలో శ్మశానవాటిక మెరక పనులు, డ్రెయిన్ సమస్య పరిష్కరించామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన పలు సమస్యల్ని పరిష్కరించి, ప్రాధాన్యతా క్రమంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు.

పాఠశాలకు వాటర్ ట్యాంక్ బహూకరణ

ఆకివీడు: విద్యార్థులకు రక్షితనీరు అందజేసే విధంగా దాతలు స్పందించాలని లయన్స్ జిల్లా గవర్నర్ పంకజాక్షం విజ్ఞప్తి చేశారు. స్థానిక శివాలయం స్కూల్‌కు లయన్స్ అభయ క్లబ్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంక్‌ను గురువారం బహూకరించారు. ఈ సదర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అన్ని వసతులూ కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వచ్ఛమైన మంచినీరు తాగడం ద్వారా పలు రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో లయన్స్ రీజియన్ చైర్మన్ ఆర్వీ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం

పెనుగొండ: పెనుగొండ కళాశాల కూడలి వద్ద విఘ్నేశ్వర స్వామి ఆలయం పునఃప్రతిష్ఠ మహోత్సవం గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ ఈశ్వర వినాయక షేడీ యువసేన ఆధ్వర్యంలో ఉదయం నుంచి పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం కుడిపూడి తరుణ్‌కుమార్, గంగాభవానీ దంపతులు భక్తి శ్రద్ధలతో విఘ్నేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ సేవాదళ్ కన్వీనరు బాలం సత్తిరాజు, తమనంపూడి సత్యనారాయణ రెడ్డి, తేతలి సత్యనారాయణ రెడ్డి, బండారు వర ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధులకు ఆర్థిక సహాయం

పాలకొల్లు అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురు వృద్ధులకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు ఆర్థిక సహాయం అందిచడం అభినందనీయమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహారావు అన్నారు. చింతపర్రు గ్రామానికి చెందిన జి.బుద్దేశ్వరరావు, పాలకొల్లు లక్ష్మీనగర్‌కు చెందిన ర్యాలి సుగుణలకు ఫౌండేషన్ తరఫున ఆయన ఒక్కొక్కరికీ రూ.10 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ పాలకొల్లు శాఖ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, పెన్మెత్స జగపతిరాజు పాల్గొన్నారు.